క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ముతో విహార యాత్రలా?

అల్లిపురం: ప్రజలు కడుతున్న పన్నులతో కార్పొరేటర్లు, అధికారులు విహార యాత్రలు చేయడం వల్ల ఒరిగేదేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిబంధనల పేరుతో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు, వారసత్వంగా వచ్చిన ఆస్తులకు ఇంటి పన్ను వెయ్యకపోవడం తగదని ఆయన పేర్కొన్నారు. జాప్యాన్ని నివారించాలన్నారు. పాత యజమాని పేరుతో ఉన్న ఇంటి పన్ను మార్చకపోవడం వల్ల కుటుంబ అవసరాలు, పిల్లల పెళ్లిళ్లకు, అమ్ముకోవడానికి వీలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని పరిష్కరించేందుకు కార్పొరేటర్లు, అధికారులు కృషి చేయాలని పైడిరాజు విజ్ఞప్తి చేశారు.

పోలీస్ సిబ్బందికి పోటీలు



పోటీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, న్యాయ నిర్ణేతలు తదితరులు

అల్లిపురం: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో పోలీస్ సిబ్బందికి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 'చేంజెస్ టు ఇన్ ద ప్రొటెక్షన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన పోటీలో నగర వ్యాప్తంగా 48 మంది పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ఆచార్య గౌతమిలత, మరొక ఆచార్యులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 31వ తేదీన అమరవీరుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నారు.

విద్యార్థులకు పోటీలు



విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న ఆరిలోవ ఎస్ఐ కృష్ణ

ఆరిలోవ: పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా నగరంలో వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆరిలోవ పోలీసులు పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విశాలాక్షినగర్‌లో బీవీకే హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణ మాట్లాడుతూ 'సైబర్ క్రైం నిర్మూలనలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు జరిపినట్లు తెలిపారు. తోటగరువు హైస్కూల్‌లో 50 మంది, బీవీకే పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు.

ఉద్యానవనం.. అధ్వానం

పాతనగరంలోని లక్ష్మీ టాకీస్ దగ్గరున్న జీవీఎంసీ పార్కు నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు ఎండకి ఎండి, వానకి తడిసి శిథిలమయ్యాయి. నిర్వహణ లోపం కారణంగా ఈ పార్కును అటు వాకర్లు గానీ, ఇటు వ్యాయామం చేసే వారు కానీ ఉపయోగించుకోవడంలేదు. అదే విధంగా ఎక్కడి పార్కులోనైనా జిమ్ పరికరాలతో పాటు పిల్లల కోసం ఆట పరికరాలు కూడా ఏర్పాటు చేస్తారు. కానీ ఈ పార్కులో పిల్లల కోసం ఒక్క ఆట పరికరం కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ పార్కును అందంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని అందరూ కోరుతున్నారు.



వృథాగా ఉన్న జిమ్ పరికరాలు

- లక్ష్మీ టాకీస్ జీవీఎంసీ పార్కు శిథిలం
- పట్టపగలే మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- కన్నెత్తి చూడని వాకర్లు, యువకులు
- పట్టించుకోని అధికారులు

జగదాంబ: వైఎస్సార్‌సీపీ హయాంలో పార్కులు కళకళలాడితే నేడు కూటమి ప్రభుత్వ హయాంలో కళాహీనంగా తయారయ్యాయని పాతనగర వాసులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 39వ వార్డు పాతనగరంలోని లక్ష్మీ టాకీస్ దగ్గరున్న ఎకైక పార్కు నిర్వహణ లోపం కారణంగా వినియోగంలో లేకుండా పోయింది. వర్షాలు కురిస్తే పార్కు చెరువులా మారుతోంది. వర్షం నీరు పార్కులో ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉండిపోతోంది. దాంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కారణంగా వాకర్లు, ఎక్సర్‌సైజ్‌లు చేసే వాళ్లు ఈ పార్కుకు రావడం మానేసారు.

వాకర్ల అసంతృప్తి..

నగరాభివృద్ధికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎంతో చేస్తున్నా పార్కుల అభివృద్ధిని పట్టించుకోకపోవడం విచారకరమని వాకర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వార్డులో చిలకపేట సమీపంలో పెద్ద పార్కు ఉన్నప్పటికీ అందులో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. కేవలం వ్యాయామ పరికరాలు, కూర్చోవడానికి నాలుగు బల్లలు ఏర్పాటు చేశారంటున్నారు. సేద దీరడానికి అనుకూలమైన వస్తువులు, ఆహ్లాదం కోసం రకరకాల పూలమొక్కలు, చెట్ల వంటివి ఏర్పాటు చేయకపోవడం వల్ల ఇది పార్కులా లేదని పెదవి విరుస్తున్నారు. చిన్నారులకు అయితే ఆటల కోసం ఒక్క పరికరం కూడా పెట్టకపోవడంపై చిన్నారుల తల్లిదండ్రులు మండి **పడుతు**న్నారు. పాతనగరంపై ఎందుకు చిన్న **చూపు అని** ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు మారితే **అభివృద్ధి** చేయాలి గానీ నిర్లక్ష్యం చేయకూడదని పాతనగర వాసులు చెబుతున్నారు.



నిర్వహణ లోపం కారణంగా అస్తవ్యస్తంగా ఉన్న పార్కు

మందుబాబులకు అడ్డా..

నిర్వహణ లోపంతో పార్కు మందుబాబులకు అడ్డాలా మారిందని స్థానికులు వాపోతున్నారు. గతంలో రాత్రివేళ్లలో వచ్చి మద్యం సేవించే వారని ఇప్పుడు ఉదయం వెళ్లలోనే పార్కుకు వచ్చి దర్జాగా మందు సేవించి తగాదాలకు దిగుతున్నారని ఆరోపిస్తున్నారు. సమీపంలోనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఉన్నా మందుబాబులు ఎలాంటి భయం లేకుండా మద్యం సేవించి గ్లాసులు, సీసాలు పార్కులోనే వదిలి వెళ్తున్నారంటున్నారు. జీవీఎంసీ అధికారులు, పోలీసులు స్పందించి పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు, గ్లాసులు

పార్కును అభివృద్ధి చేయండి..



ఈ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక్క పార్కును పెద్దలు, పిల్లలకు అనుకూలంగా అభివృద్ధి చేయాలి. వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి. అలాగే మొక్కలు నాటి ఆహ్లాద వాతావరణం కల్పించాలి. అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా తగిన చర్యలు తీసుకుంటే ఈ పార్కు చుట్టుపక్కల వారికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

–సన్యాసిరావు, చిలకపేట, 39వ వార్డు

ఆటవస్తువులు ఏర్పాటు చేయాలి..



పాగనగరం చిన్నారులు ఏ పాపం చేశారు? జీవీఎంసీ అన్ని రకాల పన్నులు చెల్లించుకుంటుంది. కానీ ఎక్కడా చిన్నారుల కోసం ఒక్క ప్లేగ్రౌండ్ కానీ, పార్కు కానీ ఏర్పాటు చేయలేదు. ఉన్న ఈ పార్కులో అయినా ఆట వస్తువులు ఏర్పాటు చేస్తే పిల్లలు ఆడుకుంటారు కదా. ఎప్పుడూ బీచ్ రోడ్డులోనే ఏర్పాటు చేస్తే పేదవాళ్ల పరిస్థితి ఏమిటి?

– రమేష్, పాతనగరం, జీవీఎంసీ 39వ వార్డు

ఏఎంసీలో ఫౌండేషన్ కోర్స్ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో తాజా బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం 2–వారాల ఫౌండేషన్ కోర్సు గురువారం మొదలైంది. జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఈస్ట్) లక్ష్మణమూర్తి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, అనాటమీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎస్. రవీంద్ర కిషోర్ ఈ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీ శేషమ్మ ర్యాగింగ్ నిరోధక చట్టం, దానిలోని సెక్షన్లు, ప్రధాన నిబంధనలపై విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారికి విధించే వివిధ శిక్షల గురించి తెలిపారు. సైబర్ క్రైమ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో పాటు నార్కోటిక్, సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, పోక్సో యాక్ట్, మోటార్ వెహికల్స్ యాక్ట్‌లపై విద్యార్థులకు వివరించారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం : రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి బాబాకు అర్చనలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం బాబా భజన, పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ధ్యాన మందిరం ఆవరణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టైియో ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మంది భక్తులు, స్థానికులు పరీక్షలు చేయించుకున్నారు.

మర్యాదపూర్వక కలయిక





వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్

జనం జగన్‌నే కోరుకుంటున్నారు

- సూపర్ సిక్స్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పాలననే కోరుకుంటున్నారని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియాతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేందుకు విశాఖ వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని వాసుపల్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రజలు కూటమి పాలన, జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకుని ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటి వరకు ఒక్క సిక్స్ కూడా కొట్టలేదని ఎద్దేవా చేశారు. అలాగే మార్చి 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అన్నారని, ఎప్పుడు అమలు చేస్తారో తెలియని దుస్థితి నెలకొందన్నారు. నిరుపేద మత్స్యకారులకు భరోసా కోసం ఎదురు చూపులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై నానాటికీ దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షాత్తు హోం మంత్రి ఇలాకాలో లైంగిక దాడులు పెరగడంపై దుయ్యబట్టారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇచ్చే దిక్కే లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశాఖ కార్యనిర్వాహక రాజధానిగా చేయడానికి బాటలు వేసినప్పటికీ కూటమి తూట్లు పొడిచి ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు.



జగన్‌మోహన్‌రెడ్డితో వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందన

డాబాగార్డెన్స్: 'కందుకూరి వీరేశలింగం పంతులు–సాహితీ సేవ' అనే అంశంపై కళాభారతిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. కళాశాలకు చెందిన ఎస్. ఆశ్రిత (బీఎస్సీ ఫస్టియర్) మొదటి బహుమతి గెలవగా, వి. మనుషా (బీఎస్సీ ఫస్టియర్) ద్వితీయ, పి. వెంకట శివాని (బీకామ్ ఫస్టియర్) తృతీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విజేతలుగా నిలిచిన విద్యార్థినులను అభినందించారు. విద్యార్థుల్లో నిర్మాణాత్మక, సృజనాత్మక, లోతైన ఆలోచనను పెంపొందించేందుకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీ పద్మకుమారి, బి. రాధమ్మ, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

సోషల్ వర్క్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. సోషల్ వర్క్ ఫస్టియర్ విద్యార్థులు ప్రభుత్వ మానసిక చికిత్సాలయం, ఆర్‌సీడీ ఆస్పత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక సమస్యలు, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం, రోగులకు అందించే చికిత్సలు, సామాజిక సేవ తదితర అంశాలపై విద్యార్థులకు అధ్యాపకులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరినాథ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.అబ్రహం, డాక్టర్ జి.పుష్పలత, డాక్టర్ వేసవిల, డాక్టర్ సూరిబాబు, డాక్టర్ హనుమంత లక్ష్మణరావు, డాక్టర్ ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యులు



అర్జునరావుని అల్లుడికి అప్పగిస్తున్న వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి



ఏయూటీడీ, శ్రద్ధ టీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన బాధితులు

సీతమ్మధార: ఇంట్లో మద్యం తాగనివ్వడం లేదన్న నెపంతో ఇల్లు వదిలి వచ్చేసిన ఒక వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గాజువాక దరి పెదగంట్యాడలో కుమార్తె, అల్లుడితో కలిసి నివసిస్తున్న అర్జునరావు (61) మద్యానికి బానిస అయ్యారు. ఈ నేపథ్యంలో ఇంట్లో మద్యం తాగినివ్వడం లేదని మనస్తాపం చెందిన అర్జునరావు విశాఖ రైల్వేస్టేషన్‌కి వచ్చేశారు. ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసి అర్జునరావును ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతిగృహానికి తరలించారు. అతని వద్ద అల్లుడు పట్నాల నూకరాజు ఫోన్ నంబర్ తీసుకుని సమాచారం ఇవ్వడంతో ఆయన వసతిగృహానికి వచ్చారు. దీంతో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి సమక్షంలో అర్జునరావుని అల్లుడికి అప్పగించారు. కుమార్తె, అల్లుడితో బుద్ధిగా మసలుకోవాలని అర్జునరావుని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం కేర్ టేకర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్‌కు ఇతర రాష్ట్రాల అభాగ్యులు..

మానసిక రుగ్మతలు, ఇతర సమస్యలతో వేరే రాష్ట్రాల నుంచి విశాఖ వచ్చిన పలువురిని ఆశీలమెట్ట దరి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ అధికారులు షెల్టర్‌కు తరలించారు. పసుపు చత్తీస్‌ఘడ్‌కు చెందిన పరమేశ్వరావు (40), దీపక్ శర్మ (38), మహారాష్ట్రకు చెందిన రాహుల్ వసంత్ దర్గేవ్ (45), రవీంద్రకుమార్ (20), బీహార్‌కు చెందిన రవీంద్ర యశ్వంత్(30), ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్ సరోవర్ (60) తదితరులను ఏయూటీడీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది షెల్టర్లకు తరలించి ఆశ్రయం కల్పించారు. వీరికి శ్రద్ధా టీం సహకారంతో ట్రీట్మెంట్ చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు. వారి వివరాలు సేకరించి శ్రద్ధా టీం ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

డోలీ మోత నుంచి విముక్తి కల్పించండి



విశాఖ జెడ్పీ కార్యాలయం వద్ద డోలీలతో గిరిజన మహిళల ప్రదర్శన

మహారాణిపేట : తరాలు మారినా తలరాతలు మారలేదని ఆవేదన చెందారు.. తమకు ఎన్నాళ్లీ కష్టాలని నిలదీశారు.. డోలీ మోతల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ గిరిజన మహిళలు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. గురువారం విశాఖలో జిల్లా పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరిగిన సందర్భంగా తమ కష్టాలు అందరికీ తెలిసేలా ప్రదర్శన జరిపారు. రోగులను, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు తాము కొండ కోనల్లో ఎంత కష్టపడుతున్నామో అర్థమయ్యేలా డోలీ కట్టి మరీ చూపించారు. ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ సభ్యుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలో జాజులబంద, నీలబంద, దాయర్తి గిరిజన గ్రామాలకు, కొయ్యూరు మండలం మూలపేట, రోలుగుంట మండలం పిత్రగడ్డ, నీలబంద, పెదబుగోరు గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయాలని కోరారు. ఈ రెండు జిల్లాల కలెక్టర్లు స్వయంగా పై గ్రామాలను పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.వెంకటరావు, కె.చిన్నారావు, రాజారావు పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్స్‌ను ఎస్సీ జాబితాలో చేర్చాలి

సీతంపేట : దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.శ్యామ్యూల్ ఆనంద్ కుమార్, విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ కూచుపూడి బాబూరావు డిమాండ్ చేశారు. గురు ద్వారా సమీపంలోని చర్చిలో ఆల్ ఇండియన్ క్రిస్టియన్ మైనార్టీ ఫ్రంట్ ఛైర్మన్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పర్యావరణ హిత దీపావళిపై అవగాహన

ఎంవీపీకాలనీ: పర్యావరణ హిత దీపావళి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎస్ రాజా ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీలోని కళాశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణ హిత దీపావళిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దీపావళి రోజు వినియోగిస్తున్న మందుగుండు సామగ్రి ద్వారా వాతావరణానికి జరుగుతున్న నష్టాన్ని వివరించారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్



బాధితులను ఎలా కాపాడాలో వివరిస్తున్న వలంటీర్లు

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ వలంటీర్ల మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో బాంబు దాడులు, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే... ఎలా బయటపడాలో... ఎలా ప్రాణాలు రక్షించుకోవాలో... ఇతరులను ఎలా రక్షించాలో కళ్లకు కట్టినట్లు చూపించారు విశాఖపట్నంలో గల జోనల్ సివిల్ డిఫెన్స్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ్ ప్రధాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు అందజేయాల్సిన సేవలు తెలియజేశారు. ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సివిల్ డిఫెన్స్ వలంటీర్లు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని, ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని సిద్ధార్థ్ తెలిపారు. వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ వలంటీర్లను అభినందించారు. డ్రిల్‌ను సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్లు సుధీర్‌బాబు, వైవీ రెడ్డి పర్యవేక్షించారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–2 పరిధి 8,9,10,11,12 వార్డులు, జోన్–3 పరిధి 20, 22 వార్డుల పరిధి పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు టీఎల్ సుధాకర్ గురువారం పేర్కొన్నారు. కొమ్మాది పంపు హౌస్‌లో పంపు సెట్లు మరమ్మతులకు గురికావడంతో శనివారం ఆయా జోన్–2, జోన్–3 పరిధిలో గల పలు వార్డుల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందన్నారు. జోన్–2 పరిధి 8వ వార్డు సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, ఎండాడ, వివేకానంద నగర్, రాజీవ్‌నగర్, రుషికొండ, 9, 10 వార్డుల్లో గల అన్ని ప్రాంతాలు, 11వ వార్డులో గాంధీనగర్, బాలాజీనగర్, అన్నానగర్, 12వ వార్డులో చినగదిలి, పెదగదిలి, సూర్యతేజనగర్, సాలిపేట తదితర ప్రాంతాలు, జోన్–3 పరిధిలో గల ఎంవీపీ సెక్టార్లు 1 నుంచి 7వరకు 9, 10, 11 వార్డుల్లో గల అన్ని ప్రాంతాలు, 20వ వార్డులో పోలమాంబగుడి లైన్, ప్రశాంతినగర్, వర్మగారి రోడ్డు, 22వ వార్డు మంగాపురం కాలనీ, మంగాపురం కాలనీ డౌన్, కాగితాల వీధి అప్, కాగితాల వీధి డౌన్ తదితర ప్రాంతాలకు తాగునీటి అంతరాయం కలగనుందని చెప్పారు. అత్యవసర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు.